## క్లుప్తంగా

### పంటల బీమాపై అవగాహన



రైతులుకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

**సరుబుజ్జిలి:** వాతావరణ ఆధారిత పంటల బీమాపై అవగాహన ఉండాలని ఉద్యానవన విస్తరణాధికారి హెచ్.తిరుపతిరావు సూచించారు. చిగురవలస పంచాయతీ పరిధిలోని కొండ్రగూడ గ్రామంలో బీమా విధానంపై రైతులుకు బుధవారం అవగాహన కల్పించారు. పంటల బీమా ప్రతీ హెక్టార్‌కు రూ.4 వేల వంతున ఈ నెల 15 లోగా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బొడ్డేపల్లి పద్మనాభం, పలువురు రైతులు పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

**సరుబుజ్జిలి:** గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని మూలసవలాపురం, పెద్దసవలాపురం గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ ఎం.పావని, సర్పంచ్‌లు తర్లాడ ఈశ్వరరావు, పల్లె సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### అపార్ నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ జనార్దన్

**హిరమండలం:** ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అపార్ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పూడి జనార్దన్ ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో అపార్ డేటా నమోదు కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. యూడైస్, ప్లస్ వెబ్‌సైట్లలో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. విద్యాంజలి, బడి బయట పిల్లల వివరాలను సేకరించాలన్నారు. ఈ నెల 14లో మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశంపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. సీఆర్ఎంటీ, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

### యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులతో కలిసి పంటలను పరిశీలిస్తున్న ఏడీ రాజగోపాల్

**ఎల్.ఎన్.పేట:** అపరాల పంటలైన పెసర, మినుము సాగులో యాజమాన్య పద్ధతులను పాటించటం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చని కొత్తూరు డివిజన్ ఏడీ బొడ్డేపల్లి రాజగోపాల్ అన్నారు. మండలంలోని చొర్లంగి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులుతో సమావేశం నిర్వహించారు. విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువులు, సాగునీటి యాజమాన్య పద్ధతులు, పూతదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మంచు ప్రభావం లేకుండా అపరాల పంటల్లో పూత నిలిచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీఆర్సీలు వై.సూర్యకుమారి, శిరీష, ఏఓ పైడి లతశ్రీ, ఉద్యాన సహాయకులు, గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రూ.18 వేల ఆర్థికసాయం



పద్మకు ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

**నరసన్నపేట:** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దొప్పల పద్మకు ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.18 వేలు బుధవారం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన పద్మ కుమారుడు ఉర్లాం స్కూల్లో టెన్త్ చదువుతున్నాడు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఉపాధ్యాయులు స్పందించి విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని పద్మకు హెచ్ఎం హర్షవర్ధన్, ఉపాధ్యాయులు అందించారు.

# శాశ్వత ఫలసాయం

- ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త పనులు ప్రారంభం
- నీటి కుంటలు, కందకాల తవ్వకానికి ప్రాధాన్యం
- పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం
- ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



పాతపట్నం మండలం సీతారాంపల్లిలోని మామిడి తోటల్లో చెట్ల చుట్టూ తవ్వుతున్న కందకాలను పరిశీలిస్తున్న ఏపీడీ రాధ

**పాతపట్నం:** ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం న్యూస్ట్రాటజీ వర్క్స్ (పనులు) ప్రారంభించారు. ఇప్పటికే ఈ పనులకు మంచి ఆదరణ ఉండగా.. నెలన్నర కిందట నిర్వహించిన గ్రామసభల ద్వారా మరికొన్ని పనులకు రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతులను ప్రోత్సహించడమే కాకుండా.. వారికి పక్కాగా రెండు వందల రోజుల పని కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది. పచ్చదనమే ప్రధానంగా న్యూస్ట్రాటజీ వర్క్స్ పేరుతో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పనుల అంచనాలు రూపొందించారు. అటు రైతులు, ఇటు వేతనదారులకు దీర్ఘకాలికంగా లబ్ధి చేకూర్చడం, అన్ని ప్రాంతాల్లో పచ్చదనం, పండ్లతోటల ద్వారా రైతులకు శాశ్వత ఫలసాయం అందివ్వడమే ధ్యేయంగా ఈ పనులు చేపట్టడం జరుగుతోంది.

**నియోజకవర్గంలో మండలాల వారీగా వివరాలు ఇలా..**

| మండలం | పంచాయతీలు | టార్గెట్ | ప్రారంభించిన పనులు |
|---|---|---|---|
| పాతపట్నం | 34 | 95 | 83 |
| హిరమండలం | 23 | 60 | 51 |
| కొత్తూరు | 43 | 95 | 81 |
| మెళియాపుట్టి | 37 | 53 | 51 |
| ఎల్.ఎన్.పేట | 22 | 23 | 16 |

**మూడేళ్లకు రూ.35 వేలు..**

న్యూస్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్లతోటల పెంపకానికి ఉపాధి పథకం ద్వారా ప్రోత్సాహకాలు కల్పించడం జరుగుతోంది. హార్టీకల్చర్ ద్వారా 14 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులుకు ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు ఇస్తారు. వీటిని మూడేళ్లపాటు పెంపకానికి ఏడాదికి రూ.35 వేలు వరకు ఉపాధి పథకం ద్వారా అందిస్తారు. మూడేళ్ల అనంతరం ఫలసాయాన్ని రైతులే పొందవచ్చు.

**ఓ వైపు చెట్ల సంరక్షణ, మరోవైపు ఆదాయం..**

పొలాల చుట్టూ, పొలాల గట్లు, చెట్లు, మొక్కల చుట్టూ కందకాల (ట్రెంచ్‌లు) ఏర్పాటుకు ఉపాధి పథకం ద్వారా నిధులు చెల్లిస్తున్నారు. ఒక్కోచోట ఈ పనుల ద్వారా రైతులకు అటు పొలాల వద్ద చెటన్లు సంరక్షించుకునే అవకాశంతోపాటు రూ.17 వేల వరకు వేతనం లభిస్తుంది. మరోవైపు ఈ కందకాలతో చెట్టుకు నీటి సదుపాయం కలుగుతుంది. మూడెకరాలున్న రైతులు తమ మెట్టు ప్రాంత పొలాల్లో నీటికుంటలు తువ్వుకునేందుకు నిధులను కేటాయిస్తున్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతోపాటు రెండు మీటర్ల లోతు తప్పనిసరిగా తవ్వాలి. వీటికి రూ.50 వేల వరకు అందజేస్తారు.

**ఇప్పటివరకు 282 దరఖాస్తులు..**

న్యూస్ట్రాటజీ వర్క్స్‌కు పంచాయతీల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 282 దరఖాస్తులు వచ్చాయి. పనులు కూడా చేపడుతున్నారు. 200 వందల రోజుల ప్రణాళికలో భాగంగా నియోజకవర్గంలో 326 పనులు టార్గెట్‌గా నిర్ణయించారు.

**ఉపయోగించుకుంటే చాలా మంచిది..**



న్యూస్ట్రాటజీ వర్క్స్‌లో భాగంగా పండ్లతోటలు, టేకు మొక్కలు పెంపకానికి అవకాశం కల్పిస్తున్నాం. కందకాల తవ్వకానికి నిధులు కేటాయిస్తున్నాం. ఇటు రైతులకు, అటు వేతనదారులకు ఈ పథకం చాలా మంచిది. రైతులు ఈ అవకాశం వినియోగించుకుంటే ప్రయోజనం ఉంటుంది.

– కె.సురేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ, పాతపట్నం

# పేదల సంక్షేమం పట్టదా?

- కూటమి నాయకులకు అక్రమార్జనే ప్రధానం
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**ఎల్.ఎన్.పేట:** కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని మోసం చేశారన్నారు. రైతులకు పంట పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకానికి అతీగతి లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1,500 నగదు, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు చదితే అందరికీ రూ.20 వేలు ఇస్తామని అన్నారని, వారికి ఆయా నిధులు ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పేదలు, రాష్ట్ర ప్రజల సంక్షేమం కంటే కూటమి నాయకుల ఆర్థిక ప్రయోజనాలకే సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఇసుక, మద్యం వ్యాపారాలతో కూటమి నాయకులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కూటమి నాయకుల అక్రమాలను ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారన్నారు. జిలా నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావులు పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి పాలనలో నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. ధరలు పెరిగినప్పుడు జగనన్న ప్రభుత్వ హయాంలో జిల్లాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సరుకులు తక్కువ ధరలకే విక్రయించామన్నారు. ఇప్పుడు అలాంటి చర్యలేవీ లేవన్నారు. ప్రజలు అన్ని విషయాలూ గమనిస్తూనే ఉన్నారన్నారు.

# ఎమ్మెల్యే దృష్టికి పీహెచ్‌సీల సమస్యలు



ఎమ్మెల్యేకు సమస్యలు తెలియజేస్తున్న వైద్యులు

**సారవకోట:** మండలంలోని సారవకోట, బుడితి పీహెచ్‌సీలలో ఉన్న సమస్యలను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి ఆయా పీహెచ్‌సీ వైద్యులు బుధవారం తీసుకువచ్చారు. సారవకోట పీహెచ్‌సీలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సారవకోట పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.85 వేలు మాత్రమే మంజూరు చేస్తున్నారని, దీంట్లో సగం మొత్తం నైట్ వాచ్‌మన్‌కు ఇవ్వడం జరుగుతుందని, మిగిలిన మొత్తం ఇతర కార్యక్రమాలు కేటాయించేందుకు సరిపోవడం లేదని వైద్యురాలు దేవిక తెలిపారు. ముగ్గురు స్టాఫ్ నర్సులుండాల్సిన చోట ఇద్దరే ఉండటంతో షిఫ్టులు వేసే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బొంతు పీహెచ్‌సీ భవనానికి రక్షణ గోడ లేకపోవడంతో పాములు, ఇతర జంతువులు వస్తున్నాయని, ఆస్పత్రి వరకు వీధి దీపాలు లేక రాత్రిపూట వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైద్యురాలు సుస్మిత తెలిపారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ కృష్ణమోహన్, ధర్మాన తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**గ్యాస్ సిలిండర్ల పంపిణీ..**

సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే రమణమూర్తి పంపిణీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లు వేలం ఖరారు

**కొత్తూరు:** పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట మండలం పరిధి పులిపుట్టిలో నిర్మించిన మెట్టు దుర్గమ్మ ఎంఆర్ఎం రైస్ మిల్లు వేలం పాటను కొత్తూరు పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. సీతంపేట మండలం జామితోటకు చెందిన జామి సంతోష్ అత్యధికంగా రూ.92.25 లక్షలకు దక్కించుకున్నారు. కొత్తూరు డీసీసీబీ బ్రాంచ్ సూపర్‌వైజర్, సేల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించినట్లు బ్రాంచ్ మేనేజర్ డి.ప్రసన్న తెలిపారు. ఈ వేలం పాటకు తొమ్మిది మంది హాజరయ్యారు. డీసీసీబీ డీజీఎం ఎస్.రమేష్, డీఆర్వో శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# సీఐ, ఎస్ఐల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

- ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ



సీఐతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

**పాతపట్నం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పాతపట్నం సీఐ రామారావు, ఎస్ఐ లావణ్య గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు సమస్యలు వివరించేందుకు వస్తే.. సీఐ, ఎస్ఐ ఎందుకు రాలేదని, ఆ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఎవరు చూస్తారని అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ఉన్నాధికారులకు తెలియజేస్తానని ఆవేదనతో సీఐకు ఫోన్ చేశారు. ఫోన్ చేసిన పది నిమిషాల్లోనే సీఐ, ఎస్ఐ చేరుకున్నారు. మొత్తం 367 వినతులు వచ్చాయి. వీటిని అధికారులు పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పాతపట్నం–తెంబూరు ఆర్అండ్‌బీ రోడ్డును బాగుచేయాలని, పాతపట్నం కళింగ వైశ్య సంఘం నిర్మించిన శ్మశాన వాటికకు సీసీ రహదారి నిర్మించాలని, సీతారాంపల్లి సమీపంలో ఉన్న రైల్వే అండర్ పాసేజ్ వద్ద విద్యుత్ స్తంభాలను తొలగించాలని, ఇళ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు చేయాలని, రహదారులు, తాగునీటి బోర్లు నిర్మించాలని వినతులు అందాయి. మండల ప్రత్యేకాధికారి కరుణాకరరావు, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీఓ చంద్రకుమారి పాల్గొన్నారు.

### జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలి

**మెళియాపుట్టి:** మండలంలోఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న మెటీరియల్ కాంపోనెంట్, ఇతర పనులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్షించారు. సీసీ రహదారులు, పశువుల షెడ్లు, ఇంకుడు గుంతల పనులకు వెంటనే జియోట్యాగింగ్ చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైన అన్ని పనులు గుర్తించాలని, వాటికి అంచనాలు తయారుచేసి పనులను ప్రారంభించాలన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టిన వారికి ఉపాధి పథకం ద్వారా 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. ఏపీఓ టి.రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

### తూతూ మంత్రంగా రెవెన్యూ గ్రామ సభ



జనాలు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

**సారవకోట:** మండలంలో ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. బుధవారం అంగూరులో నిర్వహించిన గ్రామసభలో ప్రజలకంటే అధికారులు, ప్రజాప్రతినిధులే ఎక్కువగా హాజరయ్యారు.

### ఆదివాసీల సంప్రదాయాలను కాపాడాలి



మాట్లాడుతున్న వాబ యోగి

**సారవకోట:** ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. బుధవారం ఢిల్లీలో ప్రముఖ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమినార్‌కు హాజరయ్యారు. నాగరిక ప్రపంచానికి దూరంగా కొండల్లో జీవిస్తున్న ఆదివాసీల ఆచార, వ్యవహారాలపై ప్రభుత్వాలు అధ్యయనం చేయాలన్నారు. వారి జీవన విధానాన్ని మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసీల మనుగడకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని, కొన్ని అగ్రకులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం చేయండి

**మెళియాపుట్టి:** ఉపాధి క్షేత్రసహాయకులు చాలీచాలని వేతనాలతో 17 ఏళ్లుగా కుటుంబాలను నెట్టుకువస్తున్నామని, ఉద్యోగ భద్రతతోపాటు, కనీస వేతనం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా యూనియన్ నాయకుడు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో క్షేత్ర సహాయకులతో సమావేశమయ్యారు. క్షేత్రసహాయకుల భవిష్యత్ కార్యాచరణ గూర్చి మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

### శిథిలావస్థ..



సరుబుజ్జిలి మండల కేంద్రంలోని వెలుగు సమాఖ్య భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం పైపెచ్చులు ఊడటం వల్ల వర్షం నీరు లీకవుతుంది. నిర్మించిన నాటినుంచి నేటివరకు భవనానికి రంగులు కూడా వేయలేదు. మరుగుదొడ్ల తలుపులు, ఆఫీస్ గదుల తలుపులు చెదలుపట్టాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

### ఇది డంపింగ్ యార్డు కాదు..



ఈ చిత్రంలో కనిపిస్తున్నది డంపింగ్ యార్డ్ కాదు.. కొత్తూరు మండలం నివగాం వద్ద వంశధార నదీ తీరం. నది ఒడ్డున చెత్త వేస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు పొలాలు ప్లాస్టిక్ సంచులు, చెత్తతో నిండిపోతున్నాయి. పొలం పనులు చేసే సమయంలో ఇబ్బందిగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నివగాం పంచాయతీలో చెత్త సంపద కేంద్రం లేకపోవడం విశేషం.

– కొత్తూరు

### పొంచి ఉన్న ప్రమాదం



జలుమూరు మండలం కరకవలస కాలనీ – హిరమండలం మండలం కిట్టలపాడు గ్రామాల మధ్య ఉన్న వంశధార ఎడమ కాలువపైన ఐదు శతాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన రక్షణ గోడలు పూర్తిగా విరిగిపోయాయి. రాత్రి సమయంలో ప్రయాణం చేసేవారు ప్రాణాలను అరచేతిలో పట్టుకోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన దాటిన సమయంలో పశువులు కాలువలో పడిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– జలుమూరు

## సంక్షిప్తంగా...

### ఫేస్ హాజరుపై పునరాలోచన చేయాలి



పి.మోహన్‌రావు

**పొందూరు:** వైద్య ఆరోగ్య శాఖలో ముఖ ఆధారిత హాజరును జీతాలతో అనుసంధానం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని తెలుగు నాడు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పంగా మోహన్‌రావు కోరారు. పొందూరు మండలంలోని కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మాట్లాడారు. 24 గంటలూ రోగులకు అందుబాటులో ఉంటున్న ఉద్యోగులకు ఈ విధానం పెట్టడం సమంజసం కాదన్నారు.

### హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

**పాతపట్నం:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను కచ్చితంగా ధరించాలని పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య సూచించారు. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం కూడలి వద్ద బుధవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్న పొరపాటు జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. ఏఎస్ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

### నాక్ బృందం పరిశీలన

**ఆమదాలవలస:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బెంగళూరు నుంచి వచ్చిన నాక్ బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. తరగతుల వారీగా అధ్యాపకుల వివరాలు సేకరించారు. కళాశాలలో ఇది వరకు వచ్చిన ఫలితాలు, విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు, పాలక మండలి సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. బృందం చైర్మన్ శ్రీరామ్ కవలే, కోఆర్డినేటర్ రాజలింగం నారాయణ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్ మెంబర్ డాక్టర్ రాకేశ్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### వితరణ..

**పొందూరు:** స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహానికి మూడు ఫ్యాన్లు, ఐదు ట్యూబ్‌లైట్లను లైన్స్ క్లబ్ ప్రతినిధులు ఎ.కల్యాణి, బి.చక్రపాణి, డాక్టర్ వై.మల్లిబాబు అందించారు. బుధవారం వసతి గృహానికి వెళ్లి వార్డెన్‌కు అందజేశారు. లైన్స్ క్లబ్ సభ్యులు ధర్మారావు, సతీష్, ఆదినారాయణ, సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

### వేతన బకాయిలు చెల్లించాలి

**నరసన్నపేట:** వేతన బకాయిలు చెల్లించాలని 104 ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఉర్లాం పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్‌కు నరసన్నపేట 104 వాహనంలో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ కుసుమ, డ్రైవర్ వెంకటరావు బుధవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వానికి డీఎంహెచ్ఓ ద్వారా తెలియజేయాలని కోరారు.

### వీఓఏల ధర్నా..

**కొత్తూరు:** వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వీఓఏల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలోని వీఓఏలు స్థానిక ఎంఎంఎస్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. బకాయి ఉన్న ఏడు నెలల వేతనాలు చెల్లించాలని, మూడు ఏళ్ల కాల పరిమితి గల సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. వీఓఏల సంఘం నేతలు పాల్గొన్నారు.

### డ్రైనేజీల నిర్మాణం

**కొత్తూరు:** మండల కేంద్రంలోని రెల్లి వీధిలో సీసీ డ్రైనేజీల నిర్మాణ పనులు చేపడుతున్నారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు బుధవారం పర్యవేక్షించారు. సర్పంచ్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

### హెచ్చరిక

శ్రీ గౌరవ (4వ అదనపు) జిల్లా కోర్టు జడ్జి వారు (శ్రీకాకుళం) కొత్తూరు గ్రామ కాపురస్తులైన శ్రీమతి గోగుల విజయలక్ష్మి, గోగుల వరప్రసాద్‌నాయుడు జన ఇరుపురూ వైపునకు కొత్తూరు ఆర్.ఓ.ఆర్ యందున గల (పుంజ) నంజ వారి అవిభక్తపు కుటుంబమునకు సంబంధించినవిగా సుమారు ఎ. 35.66 సెంట్లుకు సంబంధించి అందు భాగమై ఉన్న జి.ఎమ్.ఆర్ షాపింగ్ కాంప్లెక్స్, (హరిఃఓం కళ్యాణ మండపం) జి.రామారావునాయుడు షాపింగ్ కాంప్లెక్స్

| | |
|---|---|
| కల్లెమ్మ ఆర్.ఓ.ఆర్ యందున గల సుమారు | ఎ. 16.58 సెంట్లు |
| పారాపురం ఆర్.ఓ.ఆర్ యందున గల సుమారు | ఎ. 2.53 సెంట్లు |
| పులిపుట్టి ఆర్.ఓ.ఆర్ యందున గల సుమారు | ఎ. 1.98 సెంట్లు |

సదరు ఆస్తులకు సంబంధించి ఇంజక్షన్ ఉత్తర్వులు ఐ.ఎ.నెం.473/2023, ఒరిజినల్ సూట్ ఓ.ఎస్. 54/2023 ననుసరించి మంజూరు చేసియున్నందున అందున గూర్చి శ్రీ గౌ॥ కోర్టు వారి విచారణలో ఉన్నందున ఇతరులు ఎవ్వరూ ఎటువంటి అన్యాక్రాంతములకు పాల్పడరాదని పాల్పడే ప్రయత్నములు జరిపితే శిక్షార్హులు కాగలరని యిందుమూలంగా హెచ్చరిక చేస్తున్నాను.

తేదీ: 06-11-2024 సం/- ఎస్.రుద్రశేఖరరావు, న్యాయవాది ఇచ్ఛాపురం, శ్రీకాకుళం. సెల్: 9440343530